


దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, గుమాస్తా ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"ఏవయ్యా సుబ్బారావ్! దేవాలయం ఆదాయం పెంచటానికి మార్గాలేవిటి? కొబ్బరికాయ కొడ్తే చీటీ పెట్టాం. అభిషేకానికి, పూజలకు చీట్లు పెట్టాం.

స్పెషల్ దర్శనానికి చీట్లు పెట్టాం, పండగల్లో ధర్మదర్శనాలెత్తేసి దేవుణ్ణి చూసినందుకు సినిమా టిక్కెట్లలా రుసుములు వసూలు చేస్తున్నాం, ఇంకా ఏవన్నా మార్గాలు చెప్పు?'' అన్నాడు ఆఫీసరు.

''ప్రసాదాలమ్మితే మంచి ఆదాయం వస్తుందండి'' అన్నాడు గుమాస్తా సుబ్బారావు.

''చూశావా! ఇంతకాలం నాకు తట్టనే లేదు. అనుకోగానే ఆలోచన వచ్చిందంటే ఈశ్వరుడు మనచేత ఎలా సేవ చేయించుకుంటున్నాడో'' ఆఫీసరు చేతులెత్తి మొక్కాడు.

''అయ్యా! ప్రసాదాల షాపు గాలిగోపురం పక్కన కడితే .... '' అన్నాగు సుబ్బారావు.

''భేషుగ్గా ఉంటుంది..... కాని పక్కనే మంగలి షాపుంది ఫర్వాలేదా?'' అని సందేహించాడు ఆఫీసరు.

''అబ్బే? ప్రసాదాల షాపు, మంగలిషాపు వేటికి వాటికేనండి ఫర్వాలేదు.''

''సరే అయితే ఇంతకీ ఆ స్థలం గుడ్డిగంగన్నది కదూ!''

''చిత్తం.''

''పదండి. తేలిగ్గా బేరమాడి కొనేద్దాం.''

ఇద్దరూ బయల్దేరారు గాలిగోపురం వైపు.

గాలిగోపురంలో గంగన్న తాత తంబురా మీటుకుంటూ తత్వం పాడు కుంటున్నాడు. కంటిచూపు లేకపోయినా వొంటినిండా విబూది పూసుకున్నాడు.

''గంగన్నా! నీ పంట పండిందోయ్!'' అన్నాడు గుమాస్తా.

తంబురా ఆగిపోయింది.

''గాలిగోపురం పక్క స్థలం నీదేగా! అది మా కమ్మేసెయ్! అందులో ప్రసాదాల షాపు పెడ్తామంటున్నారు ఆఫీసరుగారు'' అన్నాడు గుమాస్తా. గంగన్న

తటపటాయించాడు. "ఆ స్థలం నాదే కాని బాబూ! దాన్ని అమ్మేహక్కు నాకు లేదు బాబూ."

".అదేం? నీకు డబ్బిస్తామయ్యా" అన్నాడు ఆఫీసరు.

"నాకు డబ్బెందుకు బాబూ! ఆ దేవుడి ప్రసాదం మాత్రమే తిని ఈ గుడి నీడలో బతికేవాణ్ణి. డబ్బు నేనేం చేసుకుంటాను?" అన్నాడు గంగన్న.

"అయితే ఎందుకమ్మనంటావూ?" నిలదీసి అడిగాడు గుమాస్తా.

"ఎందుకంటే బాబూ .... ఇప్పటిదాకా పండగొచ్చినా పబ్బమొచ్చినా బిచ్చగాళ్ళు వండుకుతిని పడుకుంటున్నారు ఆ స్థలంలో. మీకు ఆ స్థలం అమ్మితే మీరు కాపలా వాళ్ళచేత వాళ్ళందర్నీ గెంటిస్తారు. వాళ్ళు దిక్కులేని వాళ్ళయిపోతారు" గంగన్నకి కళ్ళనీళ్ళు తిరిగాయి.

"మేం బలవంతాన ఆ స్థలం ఆక్రమించుకుంటే నువ్వేం చెయ్యలేవు తెలుసా?" బెదిరించాడు ఆఫీసరు.

"అప్పుడు ఆ బిచ్చగాళ్ళకు ఆ ఈశ్వరుడే దిక్కు" గద్గదంగా అన్నాడు గంగన్న.

"నువ్వు దేవుడి ప్రసాదం తప్ప ముట్టని నియమం కలవాడివి కదూ! రేపట్నించి నీకు ప్రసాదం పెట్టరు. ఆకలితో మాడితే నువ్వే దోవకి వస్తావ్. పదండి సార్" ఇద్దరూ చరా చరా గుడివైపు వెళ్ళిపోయారు.

గంగన్నకు నాల్గు రోజులు ప్రసాదం పెట్టలేదు. శివనామం జపిస్తూ మంచినీళ్ళతో కాలక్షేపం చేశాడు. ఐదోరోజు గంగన్నకు ఆవేశం వచ్చింది. గాలిగోపురంలోంచి తడుముకుంటూ గుడిమెట్లవైపు వచ్చాడు. మిట్ట మధ్యాహ్నంవేళ యాత్రికులంతా స్వామి దర్శనం చేసుకుని తిరిగి వెళ్తున్నారు. తంబురా మీటుకొంటూ యాత్రికులకు తన గోడు చెప్పుకొన్నాడు. "అయ్యలారా! అమ్మలారా! నాకు నాల్గు రోజుల్నించి స్వామి ప్రసాదం పెట్టడం లేదు. నేను స్వామి ప్రసాదం తప్ప ముట్టను. నాకు బతకాలనే కోరిక లేదు. కాని నేనేం పాపం చేశాను? స్వామి ప్రసాదానికి నేనెందుకు నోచుకోలేదు?"

పదిమంది అర్చకులు స్వామికి మహానివేదనలు అర్పించి తిరిగొస్తున్నారు.

గంగన్న హీనస్వరంతో అంటున్నాడు

"స్వామి ప్రసాదం నాకు దొరకదా ..... నేను పడిపోతున్నాను ....."

అందరికంటే ఆఖర్న అర్చకుల్లో పెద్దవాడైన మహదేవయ్య గంగన్నని చూశాడు. గబగబా వచ్చి తూలిపడబోతున్న గంగన్నని పట్టుకున్నాడు. మహదేవయ్య కళ్ళనిండా నీళ్ళు. మహదేవయ్య కూడా స్వామి ప్రసాదం తప్ప ఇతరం స్వీకరించడు. ఆయనకు గంగన్నను చూస్తుంటే గుండె కరిగిపోయింది.

"మహాదేవయ్య గారూ! మీరు మడిగట్టుకుని ఆగుడ్డోణ్ణి ముట్టుకుంటున్నారా?..." అన్నాడు ఆఫీసరు

"మహదేవయ్య మహా నివేదన పళ్ళెం పక్కన పెట్టి గంగన్నని మెట్లమీద కూర్చోపెట్టాడు. యాత్రికులంతా మూగారు. "అతనూ మడిగట్టుకునే ఉన్నాడండీ ...... రా గంగన్నా .... రా ..... స్వామి ప్రసాదం తప్ప ఇంకేదీ ముట్టని నియమం నాకొక్కడికే ఉందనుకున్నాను. ఇవ్వాళ ఆ ఈశ్వరుడు నా కళ్ళు తెరిపించి - ఒరేయ్! నీలాంటి భక్తులు నా కింకా ఉన్నార్రా అని చెప్పాడు. రా గంగన్నా! స్వామి నాల్గు రోజులనుంచి చిరునవ్వు నవ్వటం లేదయ్యా! దానిక్కారణం ఇప్పుడు తెలిసింది. ఇవ్వాల్టి నుంచి స్వామి ప్రసాదం ముందు నీకు పెట్టి ఆమిగిలిందే నేను తీసుకుంటాను- రా .......

గంగన్న ఆకులా వొణికిపోయాడు .... "బాబూ ....!"

"వొద్దనకు గంగన్నా ..... ఈ మహా నివేదన నా చేత్తో నీకు తినిపించనీ .... లేకపోతే నా స్వామి చిరునవ్వు నవ్వడయ్యా ..... " అంటూ మహదేవయ్య స్వామి ప్రసాదం తన చేత్తో గంగన్న నోటికందిస్తే "సాంబశివా ....." అని కరిగిపోయాడు.

యాత్రికుల "హరహర మహదేవ" కేకలతో దేవాలయ శిఖరం తుళ్ళి పడింది.*